ఆంధ్రజ్యోతి

andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 37.8 ; కనిష్ఠం 27.6



నిర్మల్
జిల్లా వార్తలు

మంగళవారం 13 మే 2025

అంగట్లో గంజాయి సిగరెట్లు



- ఓసీబీ పేపర్‌లతో గంజాయి సిగరెట్ల తయారీ
- జిల్లా వ్యాప్తంగా బహిరంగంగానే అమ్మకాలు
- మత్తుకు బానిసవుతున్న యువత
- సిగరెట్ల కూపీలాగుతున్న పోలీసులు

నిర్మల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా గంజాయి సిగరెట్ల తయారీతో పాటు అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల జిల్లా కేంద్రంలోని పలు చోట్ల పోలీసులు జరిపిన దాడులతో ఈ గంజాయి సిగరేట్ల దందా బట్టబయలైంది. కొంతమంది గంజాయిని ఓసీబీ పేపర్‌లో నింపి రోలింగ్ చేస్తూ సిగరేట్లుగా తయారు చేస్తున్నారు. బీడీల తయారీకి వినియోగించే తునికాకు మాదిరిగానే సిగరేట్ల తయారీకి ఓసీబీ(ఓడెట్ క్యాస్ క్యాడెక్ బొల్లోరే) అనే పేపర్‌ను ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఓసీబీ పేపర్‌లతో తయారు చేసి గంజాయి సిగరెట్ల అమ్మకాలు పెద్ద ఎత్తున సాగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇందులో భాగంగానే నాలుగు రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని పలు పాన్ టేలాలు, కిరాణ దుకాణాలపై పోలీసులు దాడులు జరిపారు. కొన్ని పాన్ టేలాలలో గంజాయి పొడిని సిగరెట్‌గా తయారు చేసేందుకు ఉపయోగిస్తున్న ఓసీబీ పేపర్లు పెద్ద సంఖ్యలో పోలీసులకు పట్టుబడడం కలకలం రేపుతోంది. పోలీసులు గంజాయి చాక్లెట్లు, గంజాయి పొడి అమ్మకాలపై ఇప్పటి వరకు సీరియస్‌గా దృష్టి సారించారు. అయితే పోలీసులు ఇటీవల జరిపిన దాడుల్లో ఊహించని విధంగా ఓసీబీ పేపర్లు లభించడం వారిని విస్మయానికి గురిచేసింది. దీంతో పోలీసులు ఓసీబీ పేపర్ల కొనుగోలు, సరఫరా, విక్రయదారుల కోసం ఆరా తీస్తున్నారు.



పాన్‌షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు (ఫైల్)

గుట్టు చప్పుడు కాకుండా దందా

కొంతమంది పాన్ దుకాణాలు, జర్దా దుకాణాల యజమానులు ఓసీబీ పేప ర్లలో గంజాయి పొడిని నింపి కొన్ని బ్రాండెడ్ సిగరెట్ డబ్బాల్లో నిల్వ చేస్తున్నట్లు పోలీసులు అనుమాని స్తున్నారు. గంజాయికి బానిసైన యువకులు ఆ పాన్ టేలాల వద్దకు వెళ్లి కోడ్ పేరుతో సిగరెట్లు కావాలని అడుగుతారు. దీంతో సదరు పాన్ టేలా యజమాని ఎవరికీ అనుమానం రాకుండా వాటిని బ్రాండెడ్ సిగరెట్ డబ్బాల నుండి తీసి యువకులకు విక్రయిస్తున్న పోలీసులు భావిస్తు న్నారు. ఒక్కో సిగరెట్‌ను 50 రూపాయల నుంచి 100 రూపాయల వరకు అమ్ముతున్నారని చెబుతున్నారు. గంజాయికి బానిసైన యువకులు వీటిని ఎవరికీ అనుమానం రాని రీతిలో పాన్ టేలాల వద్ద బహిరంగంగానే కొనుగోలు చేస్తూ నిర్మానుష్య ప్రదేశాల్లో ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీస్టేడియం, బైల్ బజార్, విశ్వనాథ్‌పేట్, సోఫీనగర్, మహాలక్ష్మి వాడతో పాటు మరికొన్ని శివారులో గల నిర్మానుష్య ప్రదేశాల్లో మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో ఈ గంజాయి సిగరెట్లను ఎక్కువగా వినియోగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. నిర్మల్‌తో పాటు భైంసా, ఖానాపూర్ పట్టణ ప్రాంతాల్లో కూడా ఇలాంటి గంజాయి సిగరెట్‌లను యువకులు ఎక్కువగా వినియోగిస్తున్నట్లు చెబుతున్నారు.

నాగ్‌పూర్, నాందేడ్ హైదరాబాద్‌ల నుంచి దిగుమతి

ఓసీబీ పేపర్లు నాగ్‌పూర్, నాందేడ్‌లతో పాటు జిల్లా అంతటాకి సరఫరా అవుతున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. జర్దా, గుట్కా వ్యాపారాలు చేస్తున్న కొంత మంది వీటిని నిర్మల్‌కు రహస్యంగా తీసుకు వస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఓసీబీ పేపర్ల ను సదరు వ్యాపారులు తమతో సంబంధాలు ఉన్న పాన్‌టేలాల యజమానులకు మాత్రమే రహస్యంగా విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆకర్షణీయంగా ఉండే ఖరీదైన కవర్‌లో ఈ పేపర్లను నిల్వ చేస్తున్నారు. దీని కారణంగా ఎవరూ అనుమానపడకుండా పాన్ టేలాల యజమానులు జాగ్రత్త పడుతున్నట్లు చెబుతున్నారు. రెగ్యులర్ కస్టమర్లకే వీటిని విక్రయి స్తున్నట్లు పేర్కొంటున్నారు.

కూపీలాగుతున్న పోలీసులు

గత కొంత కాలం నుంచి జిల్లాలో గంజాయి వినియోగం పెరిగిపోయిందన్న ఆరోపణల నేపథ్యంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఈ దిశగా సీరియస్ దృష్టి సారించారు. అప్పటికే పలుచోట్ల గంజాయి విక్రయిస్తున్న వారిని పట్టుకుని వారిపై కేసులు కూడా నమోదు చేశారు. అలాగే గంజాయి వినియోగించే యువకులకు కౌన్సిలింగ్ నిర్వహించి మరోసారి గంజాయిని సేవించవద్దంటూ సూచించారు. కుటుంబ సభ్యులకు సైతం కౌన్సిలింగ్‌లు జరిపారు. సరిహద్దులు, అనుమానిత ప్రాంతాలపై గట్టి నిఘా పెట్టారు. ఈ క్రమంలో కొన్ని పాన్ టేలాలపై దాడులు జరిపిన పోలీసులకు ఓసీబీ పేపర్లు పట్టుపడడంతో ఇప్పుడు ఆ కోణంలో విచారణ మొదలుపెట్టారు. ఓసీబీ పేపర్లను రవాణా చేస్తున్న వారిపైనే కాకుండా వాటిని అమ్ముతున్న వారిపై కూడా పోలీసులు కొద్ది రోజుల నుండి నిఘా పారించారు. ఈ కోణంలో దర్యాప్తు మొదలుపెట్టిన పోలీసులు ఈ పేపర్లను అమ్ముతున్న హైదరాబాద్ వ్యాపారులకు కూడా తాకీదులు జారీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. అలాగే పలు ట్రాన్స్‌పోర్ట్, పార్సిల్ ఏజెన్సీలకు సైతం హెచ్చరికలు జారీ చేసినట్లు చెబుతున్నారు. ఓసీబీ పేపర్ల సరఫరా, విక్రయాలు జరుగుతున్న అసలు వ్యాపారిని గుర్తించేందుకు పోలీసులు అన్వేషణ మొదలుపెట్టారు.



తనిఖీల్లో పోలీసులకు లభ్యమైన ఓసీబీ పేపర్(ఫైల్)

నేడు పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్

పరీక్షా కేంద్ర్రాల వద్ద సెక్షన్ 163 అమలు

నిర్మల్ రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ పరీక్ష 2025 సందర్భంగా అండర్ సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందని సోమవారం జిల్లా ఎస్పీ జానకి షర్మిల పత్రిక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల (08 పరీక్షా కేంద్రాలు) వద్ద మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా నిరోధించాలని ఉద్దేశ్యంతో జిల్లా పరిధిలో అండర్ సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందని తెలిపారు. ఈ సెక్షన్ ప్రకారం పరీక్షా కేంద్రాల వద్ద ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమిగూడ రాదని, నిషేధిత వస్తువులతో పరీక్షా కేంద్రాల వద్ద తిరగవద్దని తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని అన్ని జిరాక్స్ సెంటర్లను ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మూసి వేయాలని తెలిపారు.



ఎస్పీ జానకీ షర్మిల

52 మొబైల్‌ఫోన్లను బాధితులకు అందజేసిన ఎస్పీ

నిర్మల్ రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలో పోగొట్టుకున్న, చోరీకి గురైన 52 మొబైల్‌ఫోన్లను బాధితులకు సోమవారం అందజేసినట్లు జిల్లా ఎస్పీ జానకిషర్మిల తెలిపారు. సెల్‌ఫోన్ పోయినా, చోరీకి గురైనా ఆందోళన చెందవద్దని సీఆఐఆర్ ద్వారా తిరిగి పొందవచ్చని జిల్లా ఎస్పీ అన్నారు. ఎస్పీ మాట్లాడుతూ... మొబైల్‌ఫోన్ పోయిన, చోరీకి గురైన డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఈఐఆర్.జీవోవీ.ఇన్‌లో రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. మొబైల్ వినియోగదారులను అప్రమత్తంగా ఉండాలన్నారు. పోయిన సెల్‌ఫోన్ పట్ల అశ్రద్ధ చేస్తే ఇది వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం కలుగుతుందన్నారు. పోయిన లేదా చోరీకి గురైన మొబైల్‌ఫోన్లను త్వరితగతిన పట్టుకోవడానికి సీఈఐఆర్ వెబ్‌సైట్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో వినియోగదారులు వివరాలను నమోదు చేసుకుంటే మొబైల్స్‌ను ఈ పోర్టల్ ద్వారా సులభంగా స్వాధీనం చేసుకునే ఆస్కారం ఉంటుందని తెలిపారు. పోయిన సెల్ ఫోన్ల రికవరీ కోసం ఒక ప్రత్యేక టీం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1309 ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అందించడం జరిగిందన్నారు. సీఈఐఆర్ ఆవశ్యకతను తెలుపుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎవరికైనా సెల్ ఫోన్లు దొరికితే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో గాని లేదా ఆ నెంబర్ వారికి ఫోన్‌చేసి వారికి అప్పగించాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా సాంకేతికతను ఉపయోగించి మొబైల్‌ఫోన్‌లు రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఐటీ కోర్ ఇన్స్‌పెక్టర్ సమ్మయ్య, సీఈఐఆర్ టీం కానిస్టేబుల్ రాజేశ్వర్, నరేందర్, ప్రత్యూష, సూర్యవంశీ, రాం పవన్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు.

బాసర ఆశ్రమంలో హుండీ చోరీ

బాసర, మే12 (ఆంధ్రజ్యోతి) : బాసర పుణ్యక్షేత్రంలో గోదావరి రహదారిలో గల కేదారేశ్వర ఆశ్రమంలో గల అన్నపూర్ణదేవి ఆలయ హుండీ చోరీకి గురైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ తలుపులు ధ్వంసం చేసి దుండగులు చిన్న హుండీని పట్టుకెళ్లినట్లు చెప్పారు. ఆశ్రమంలో సీసీ కెమెరాల వైర్లను కత్తిరించి దుండగులు చోరీకి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సోమవారం ఘటన స్థలానికి వచ్చి విచారణ చేపట్టారు. అయితే ఆశ్రమానికి కొంత దూరంలో పంట పొలాల్లో హుండీకి సంబంధించిన భాగాలు గుర్తించినట్లు తెలిసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు బాసర పోలీసులు తెలిపారు. గత కొంత కాలంగా ప్రముఖ పుణ్యక్షేత్రంలో చిన్న దొంగతనాలు జరుగుతుండడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

బోరిగాంలో విగ్రహస్థాపనలో ఉద్రిక్తత

- రాళ్లు రువ్వుకున్న ఇరువర్గాలు
- ఎస్పీ రంగ ప్రవేశంతో సద్దుమణిగిన వివాదం



పరిస్థితిని చక్కదిద్దుతున్న ఎస్పీ, ఏఎస్పీ, ఆర్డీవోలు

ముథోల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండలంలోని బోరిగాం గ్రామ శివారులో గల ప్రభుత్వ స్థలంలోని హనుమాన్ విగ్రహం సమీపంలో సోమవారం ఉదయం బుద్ధ విగ్రహం ప్రతిష్ఠించడంతో గ్రామంలో ఉద్రిక్తతకు దారి తీసింది. గ్రామంలోని ఇరువర్గాలు ఒకరిపై ఒకరు రాళ్లతో దాడిచేసుకున్నారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీసింది. పలువురు గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న ముథోల్ సీఐ మల్లేష్, ఎస్సై సంజీవ్‌లు సిబ్బందితో వెళ్లి ఇరువురికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో ఏఎస్పీ అవినాష్‌కుమార్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్, పోలీస్ బలగాలు ఇటీవల మహిళా కానిస్టేబుల్‌తో ఏర్పాటు చేసిన శివంగి టీంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. దీంతో భారీ సంఖ్యలో గుమిగూడిన గ్రామ మహిళలను మహిళా పోలీసులు చెదరగొట్టారు. ఎస్పీ, అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్, భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్ రంగంలోకి దిగి ఇరు గ్రూపులను సముదాయించారు. వారు వినకపోవడంతో పరిస్థితి చేయి దాటకుండా ఎస్పీ చాకచక్యంగా వ్యవహరించి వెంటనే సంఘటన స్థలం నుండి తమ పోలీస్ సిబ్బందితో ఇరు గ్రూపులను చెదరగొట్టారు. సంఘటన స్థలానికి ఎవరిని రాకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు పోలీసులు తీసుకున్నారు. ప్రభుత్వ భూమిలో అనుమతి లేకుండా ప్రతిష్ఠించిన బుద్ధ విగ్రహాన్ని రెవెన్యూ అధికారులు వెంటనే తొలగించి, ముథోల్ తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ ఆధ్వర్యంలో ముథోల్ సీఐ మల్లేష్‌తో పాటు భారీ సంఖ్యలో పోలీసులు బోరిగాంతో పికెటింగ్‌తో పాటు భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ గొడవకు కారణమైన పలువురిని అదుపులోకి తీసుకొని గాయాలైన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరించారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

ముథోల్ మండలంలోని బోరిగాం గ్రామంలో సోమవారం జరిగిన ఉద్రిక్తతలో భాగంగా ఇరువర్గాలకు చెందిన వారిపై కేసులు నమోదు చేసినట్లు ముథోల్ సీఐ మల్లేష్ సోమవారం రాత్రి విలేకరులకు తెలిపారు. ఇరువర్గాలకు చెందిన ఐదుగురిని ప్రస్తుతం అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ ఘటనలో పాల్గొన్న మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పూర్తి విచారణ అనంతరం ఈ కేసులో ప్రమేయం ఉన్న మరికొందరిని త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

బోరిగాం గ్రామంలో 144 సెక్షన్ అమలు...

మండలంలోని బోరిగాం గ్రామంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఉద్రిక్తత ఘటన నేపథ్యంలో బోరిగాం గ్రామంలో సోమవారం 144 సెక్షన్ అమలులో ఉందని ముథోల్ తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. శాంతి భద్రతల దృష్ట్యా గ్రామంలో ఎలాంటి ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. గ్రామంలో ప్రజలు గుమిగూడ వద్దన్నారు.

అమర వీరులకు ఘన నివాళులు



దిలావర్‌పూర్, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంజర్ గ్రామస్థులు పాకిస్థాన్ కాల్పుల్లో వీరమరణం పొందిన అమర జవాన్లకు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. అమర జవాన్ల కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాలను కోరారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్లు మనోత భౌతికంగా లేకపోయిన మన గుండెల్లో ఎప్పటికీ సజీవంగానే ఉంటారని స్పెషల్ ఆఫీసర్ రాజశేఖర్ అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, గ్రామ యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి విచారణ పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



గిరిజన సంప్రదాయంతో కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న అంబుగాం గ్రామస్థులు

కుంటాల, మే, 12 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాలలో రేపటి నుంచి నిర్వహించబోయే క్షేత్రస్థాయి విచారణను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. కుంటాల మండలం భూ భారతి పథకంలో పైలట్ ప్రాజెక్టులో ఎంపికైనందున గత వారం రోజుల పాటు గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలనపై సోమవారం సాయంత్రం కలెక్టర్ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. అంతకుముందు అంబుగాం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని ప్రజలతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా భూ రికార్డులో తప్పులు సరిచేసి యజమానికి భూమిపై పూర్తి హక్కు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పేరు, విస్తీర్ణ లోపాలు, వారసత్వ హక్కులు, సర్వేనెంబరు లోపాలు, హద్దుల వివాదాలు భూ సేకరణ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. అధికారులు తప్పకుండా స్వీకరించిన దరఖాస్తులకు రశీదు అందజేయలని సూచించారు. ఈ సందర్భంగా అంబుగాం గ్రామస్తులు గిరిజన సంప్రదాయంలో కలెక్టర్‌కు స్వాగతం పలికారు. అనంతరం గ్రామస్థులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామానికి రోడ్డు, గ్రామంలో తాగునీరు, మౌలిక వసతులు, మహారాష్ట్ర సరిహద్దులో ఉన్నందున కలుగుతున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి లేనందున ఎదురవుతున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా రేపటిలోగా కార్యదర్శిని నియమిస్తామని హామీ ఇచ్చారు. ఈ రెవెన్యూ సదస్సుకు గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్ కమల్‌సింగ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



అంబుగాం గ్రామంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజల సమస్యలు త్వరగా పరిష్కరించాలి

నిర్మల్ అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. రైతు రుణమాఫీ, విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, భూ సమస్యలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు తదితర అంశాలపై ప్రజలు తమ వినతులను కలెక్టర్‌కు అందించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులో పరిష్కరించాలంటూ శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను శాఖల వారీగా క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, పరిష్కార వివరాలను రిమార్కుల విభాగంలో నమోదు చేయాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి సంబంధించిన సమాచారం దరఖాస్తుదారులకు తప్పనిసరిగా తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన టెలిఫోన్ ప్రజావాణిలో జిల్లావ్యాప్తం వచ్చిన ఫోన్లను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. దూర ప్రాంతాల ప్రజలు 91005 77132 నెంబర్‌ను సంప్రదించి వాట్సాప్ ద్వారా సమస్యలు పంపవచ్చునని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలని, అభ్యంతరాలను స్వీకరించాలని తెలిపారు. అలాగే రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులను మండల స్థాయిలో త్వరిగతిన పరిశీలించి బ్యాంకులకు పంపించాలని సూచించారు. ఇటీవల రుణాల మంజూరులో రాష్ట్రస్థాయిలో ఉత్తమ స్థానంలో నిలిచిన గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులకు, సిబ్బందికి కలెక్టర్, అదనపు కలెక్టర్లు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో అగ్నిప్రమాదం

స్క్రాప్ దుకాణంలో చెలరేగిన మంటలు

రూ. 2 లక్షల వరకు ఆస్తినష్టం



అగ్ని ప్రమాదంలో తగలబడుతున్న స్క్రాప్ దుకాణం

ఖానాపూర్, మే 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన గల స్క్రాప్ దుకాణంలో సోమవారం సాయంత్రం అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ద్వారా ప్రమాదం చోటుచేసుకున్నట్లు స్క్రాప్ దుకాణ యజమాని శంకర్ తెలిపారు. ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల వారు భయాందోళనకు గురయ్యారు. మంటలు పెద్ద ఎత్తున ఎగిసి పడడాన్ని గమనించిన స్థానికులు వెంటనే ఫైర్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఫైర్ ఇంజన్ సహాయంతో ఫైర్ సిబ్బంది అధికారులు మంటలను అదుపులోకి తెచ్చేందుకు రెండు గంటల వరకు శ్రమించారు. మూడు ట్యాంకర్ల నీటితో మంటలను మరింత వ్యాప్తి చెందకుండా అదుపు చేశారు. ఈ అగ్ని ప్రమాదంలో రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. మరో నాలుగు లక్షల రూపాయల వరకు ఆస్తిని మంటల్లో తగలబడకుండా కాపాడినట్లు ఫైర్ అధికారి పేర్కొన్నారు. ఈ మంటలను ఆర్పేందుకు ఇన్‌చార్జ్ స్టేషన్ ఫైర్ అధికారి జావేద్ అలీ, ఎల్ఎఫ్ ఖదీర్ ఖాన్, డీవోపీ హుస్సేన్, ఎఫ్ఎం వెంకటేష్, శ్రీకాంత్, సాయి, తదితరులు శ్రమించారు.



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కొడుకు

మందలించాడని తల్లి ఆత్మహత్య

నర్సాపూర్(జి), మే 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన సట్ల భోజవ్వ (75) కొడుకుతో గొడవ పడింది. తల్లిని కొడుకు మందలించాడు. దీంతో తల్లి ఆత్మహత్య చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గత భోజవ్వకు కొన్ని నెలల నుంచి మతిస్థిమితం లేదు. అదే క్రమంలో ఆదివారం తన పెద్ద కొడుకు శివయ్యతో గొడవ పడింది. దీంతో శివయ్య తన తల్లిని మందలించాడు. సోమవారం ఉదయం నిద్ర లేచేసరికి భోజవ్వ తన ఇంట్లో కనిపించకపోయేసరికి తన కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వెతుకగా నర్సాపూర్(జి) గ్రామశివారులోని స్మశాన వాటికలో గల చెట్టుకు భోజవ్వ మతిస్థిమితం సరిగ్గా లేక జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకొని చనిపోయింది. మృతురాలి చిన్నకొడుకు సట్ల పీరాజి పోలీస్ నర్సాపూర్(జి)లో దరఖాస్తు ఇవ్వగా హెడ్ కానిస్టేబుల్ జలాలుద్దీన్ అన్వర్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.



సట్ల భోజవ్వ (ఫైల్)

పోలీసులు భరోసా ఇస్తే బ్రతికేదేమో ?

సట్ల భోజవ్వ ఆదివారం పోలీసుస్టేషన్ వెళ్లి తనకు జరిగిన అవమానాన్ని పోలీసులకు చెప్పింది. పోలీసులు పట్టించుకుంటే సట్ల భోజవ్వ బ్రతికేదేమోనని గ్రామస్థులు అంటున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ..

భైంసా రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వట్టోలి గ్రామానికి చెందిన జాదవ్ వినోద్ అనే రైతు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జాదవ్ వినోద్(39) గత రెండు సంవత్సరాల నుంచి వెన్నునొప్పితో బాధపడేవాడు. వెన్ను నొప్పికి శస్త్ర చికిత్స చేసుకున్నాడు. అప్పటి నుండి వ్యవసాయం పనులు చేసుకోవడానికి ఇబ్బంది పడేవాడు. శస్త్ర చికిత్స వల్ల ఆర్థిక ఇబ్బందులు కూడా ఎదురయ్యాయి. దీంతో తనలో తానే మానసికంగా బాధపడుతూ ఉండేవాడు. రాత్రి సమయంలో భోజనం చేసి ఇంటి పైన ఉన్న గదిలో పడుకున్నాడు. ఉదయం 5:30 గంటలకు భార్య పైన ఉన్న గదిలోకి వెళ్లి చూసేసరికి దూలానికి చీరతో ఉరి వేసుకుని మరణించాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు.



జాదవ్ వినోద్ (ఫైల్)

'ఐసీడీఎస్ సీడీపీవోపై చర్య తీసుకోవాలి'

నిర్మల్ కల్చరల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ ఐసీడీఎస్ సీడీపీవోపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు డి. తిరుపతి కలెక్టర్‌ను కోరారు. సోమవారం వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల నుంచి రూ.400లు వసూలు చేస్తుందని ఆరోపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గతంలో ప్రజా సంఘాలు అనేక మార్లు ఆందోళన చేసిన పట్టించుకోలేదన్నారు. విచారణ జరిపిన ఎలాంటి చర్యలు లేవన్నారు. లోకేశ్వరం గిరిజన రైతు భూ సమస్య, పెన్షన్ల వ్యవహారంలో రిటైర్డ్ టీచర్ పాత్ర తదితర సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.


సోయం వారి బేటింగ్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీ బాపురావు

ఆదివాసీ సంప్రదాయాలకు పెద్దపీట

● మాజీ ఎంపీ సోయం బాపురావు

ఉట్నూర్, మే 12(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గిరిజనులు తమ ఆచార సంస్కృతీ, సంప్రదాయాలను పెద్దపీట వేస్తారు. అందులో భాగంగానే మండలంలోని సాకెరాలో ఆదివారం నుంచి ప్రారంభమైన పెర్సపెన్ ఉత్సవాలలో భాగంగా సూర్యదేవుడికి పూజలు చేసిన ఆదివాసీ గిరిజనులు సోమవారం సోయంవారి కోడళ్ల పెర్సపెన్ బేటింగ్ నిర్వహించారు. కొత్తగా పెళ్లిళ్లు చేసుకున్న సోయం వారి కోడళ్లు ముందుగా సోయం వారి పెర్సపెన్ ఉత్సవాల్లో పాల్గొని పూజలు చేసిన అనంతరం పెద్దవారిని కలుసుకుంటారు. సాకిరలో జరిగిన సోయంవారి బేటింగ్ ఉత్సవాల్లో మాజీ ఎంపీ సోయం బాపురావు పాల్గొన్నారు. ముందుగా గ్రామానికి చేరుకున్న మాజీ ఎంపీకి ఆదివాసీ గిరిజనులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం పూజా కార్యక్రమాల్లో బేటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఇందులో సోయం వారి 86 మంది కోడళ్లు పాల్గొనడంతో సోయం పెద్దలు వారికి పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ సోయంబాపురావు మాట్లాడుతూ అనాదిగా వస్తున్న తమ పూర్వీకుల ఆచారాలను కంటికి రెప్పలా కాపాడుకుంటు కొనసాగిస్తున్నామని అన్నారు.

ఎప్‌సెట్‌లో ప్రతిభ చాటిన రేచల్

ఆదిలాబాద్ రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం విడుదలైన ఎప్‌సెట్ ఫలితాల్లో ఆదిలాబాద్ కు చెందిన విద్యార్థిని బైపీసీ విభాగంలో స్టేట్ ర్యాంక్ సాధించి సత్తా చాటింది. ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్‌కు చెందిన కొత్తూరు అరుణ(ఎఫ్ఆర్‌ఓ) ప్రసన్నకుమార్ (న్యాయవాది) దంపతుల కుమార్తె రేచల్ ఎప్‌సెట్ ఫలితాల్లో బైపీసీ విభాగంలో 388 ర్యాంకు సాధించి రాష్ట్రస్థాయిలో సత్తా చాటింది. దీంతో కుటుంబీకులు స్థానికులు రేచల్ కు అభినందనలు తెలిపారు.

'దివ్యాంగులకు ఇళ్లు కేటాయించాలి'

ఆదిలాబాద్ రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ రూ.6 వేలు చెల్లించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు నగేష్ డిమాండ్ చేశారు. అర్హులైన దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

'మగ్గం పనులపై శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి'

బోథ్, మే 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మహిళలు శ్రీ రామానంద తీర్థ గ్రామ శిక్షణ సంస్థ సహకారంతో శిరిడి సాయి సేవ సొసైటీ సౌజన్యంతో మాసం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత కుట్టు మిషన్ మగ్గం వర్క్స్ నేర్చుకునే వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు మాసం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు మాసం అనిల్ కుమార్ తెలిపారు. మూడు నెలల పాటు నిర్వహించనున్న ఈ శిక్షణ అనంతరం సర్టిఫికెట్లను ఇస్తామన్నారు. ఆసక్తి గలవారు సొసైటీలో సంప్రదించాలని, 7013580205 తో పాటు 9533650208 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఇందులో ఐకేపీ ఏపీఎ మాధవ్, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నర్సుల సేవలు ఎంతో గొప్పవి

● ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): అంకితభావం,నిబద్ధతతో అందించే నర్సుల సేవలు ఎంతో గొప్పవని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం బెస్ట్ ఫ్రెండ్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రిమ్స్ ఆడిటోరియంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వైద్య రంగంలో నర్సుల పాత్ర చాలా కీలకమని, వారి సేవలను కలెక్టర్ రాజర్షి షా ఈ సందర్భంగా కొనియాడారు. అనంతరం చిన్నారులు చేసిన నృత్యాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, సూపరిండెంట్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

బోథ్ ఎమ్మెల్యేను కలిసిన పలు గ్రామాల ప్రజలు

నేరడిగొండ, మే 12 (ఆంధ్రజ్యోతి): బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను పలు గ్రామాల ప్రజలు మండల కేంద్రంలో మర్యాద పూర్వకంగా కలిసి గ్రామాలలో నెలకొన్న సమస్యలను వివరించారు. గుడిహత్నూర్ మండలంలోని లింగాపూర్ గ్రామంలో గ్రామస్థుల కోరిక మేరకు గ్రామంలో నూతన హనుమాన్ ఆలయం నిర్మాణానికి కృషి చేసి టెండర్ ప్రక్రియ పూర్తి చేయించినందుకు లింగాపూర్ గ్రామస్థులు ఆలయ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

అలాగే, బోథ్ మండలంలోని రేండ్లపల్లి గ్రామంలో ఈనెల 22, 23వ తేదీల్లో జరిగే హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన, కలశ స్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్‌ను ఆహ్వాన పత్రికను అందజేశారు. తలమడుగు మండలంలోని కొత్తూర్ గ్రామ ఆంజనేయ స్వాములు భక్తులు గ్రామ పెద్దలు శ్రీరంగ్, ప్రకాష్ మహరాజ్, త్రిము ఖ్, వినోద్ నాయకులు గణేష్, రాహుల్, కేశవ్ లు కలిసి పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇందులో మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

● క్రీడలతో మానసికోల్లాసం : ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం నేరడిగొండ మండలంలోని చిన్న బుగ్గారం యువకులు నిర్వహించిన మండల స్థాయి చిన్న బుగ్గారం క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన క్రీడాకారులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో క్రీడాకారులకు బహుమతులను అందజేసి అనంతరం మాట్లాడుతూ ఆటలలో గెలుపు ఓటములు సహజం క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటుతూ ప్రశాంత వాతావరణం క్రీడలు ఆడడం వల్ల మానసికంగా శారీరకంగా దృఢంగా ఉంటారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, విడిసి అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, రాథోడ్ సురేందర్, సందీప్, మాజీ సర్పంచ్ ప్రతాప్, పాండు, తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

తాంసి, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని హసనాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సోమవారం అధికారులు పరిశీలించారు. గ్రామంలో ప్రస్తుతం 63 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఈ ఇళ్ల నిర్మాణాలు ఏ మేరకు నడుస్తున్నాయో సంబంధిత గ్రామ కార్యదర్శి లావణ్య లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణాల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా చేపట్టాలని ఆమె సూచించారు. త్వరితగతిన బిల్లులు కూడా మంజూరు అవుతాయని బిల్లల విషయంలో ఎలాంటి ఆందోళన గురి కావద్దని ఆమె లబ్ధిదారులకు సూచించారు.

'అధిక రసాయన ఎరువులతో నష్టం'

ఉట్నూర్, మే 12(ఆంధ్రజ్యోతి):పంటల్లో అధిక దిగుబడులు సాధించడానికి రైతులు అధిక మోతాదులో రసాయన ఎరువులు వాడితే నేలలు గట్టిపడి నష్టం జరుగుతుందని ఆదిలాబాద్ వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని శ్యామ్‌పూర్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రైతులు అడిగిన ప్రశ్నలను నివృత్తి చేస్తూ ఈ సమాధానం వివరించారు. ఇందులో వ్యవసాయ కళాశాల టీచింగ్ అసోసియేట్ డాక్టర్ ఎస్.కిరణ్‌రెడ్డి, హార్టికల్చర్ టీచింగ్ సియేటెడ్ డాక్టర్ కె.మౌనిక, హార్టికల్చర్ ఆఫీసర్ క్రాంతికుమార్, వెటర్నరి డాక్టర్ విజయకుమార్, ఏఈఓలు కుడుమెత సుధాకర్, నాగోరావు, రవీందర్, రంజిత్, జయశ్రీ, సాయి, సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

జవాన్లకు మద్దతుగా ఎంపీ ప్రత్యేక పూజలు

తాంసి, మే 12 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్ అవలంభిస్తున్న తీరును నిరసిస్తూ సోమవారం ఆదిలాబాద్ ఎంపీ జి.నగేష్ జవాన్లకు మద్దతుగా పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయానికి చేరుకున్న ఆయన యువకులు, వివిధ పార్టీల నాయకులు, ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ జవాన్లకు ప్రతిఒక్కరూ మద్దతు ప్రకటించాలన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పిస్తున్న జవాన్లకు మద్దతు ఇవ్వడమే కాకుండా వారికి ఆత్మస్థైర్యాన్ని నింపాలన్నారు. పార్టీలు, కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం ఆలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ తాటిపల్లి రాజు పలువురు నాయకులు పాల్గొన్నారు.

'ప్రహరీ నిర్మాణాన్ని నిలిపి వేయాలి'

తాంసి, మే 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ప్రహరీ గోడను నిర్మించవద్దంటూ తాంసీకి చెందిన పలువురు యువకులు అధికారులకు విన్నవించారు. సోమవారం పాఠశాల ప్రాంగణం ఆవరణలో ప్రహరీ నిర్మిస్తామని అధికారులు సర్వే చేపట్టారు. ఈ విషయాన్ని గమనించిన గ్రామ యువకులు అక్కడికి చేరుకొని ప్రహరీ నిర్మిస్తే తమకు ఆటస్థలం లేకుండా పోతుందని అధికారులకు వివరించారు. వెంటనే నిర్మాణాన్ని నిలిపివేయాలంటూ వేడుకున్నారు. స్పందించిన పంచాయతీరాజ్ శాఖ అధికారులు నిర్మాణాన్ని వాయిదా వేశారు. యువజన సంఘం నాయకులు రాము, ఆకాష్, అశోక్, కళ్యాణ్, చింటూ, తదితరులున్నారు.

పత్తి కొనుగోళ్లలో అక్రమాల బాగోతం

(5వ పేజీ తరువాయి...)

జరిగిన అక్రమాలపై మరింత లోతుగా దర్యాప్తు జరుపుతున్నారు. అంతేకాకుండా ఇక్కడ ఒకరిద్దరు ప్రధాన పత్తి వ్యాపారులు చక్రం తిప్పారన్న ఆరోపణలు ఉన్నాయి.

అడిగినంత ఇస్తే.. అంతా ఒకేనట!!

ఈసారి సీసీఐ కొనుగోళ్లలో కొంత మంది ప్రైవేట్ వ్యాపారులదే హవా కనిపించిందన్న ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు అడిగినంత ఇస్తే అంతా ఒకే అనడంతో ప్రైవేట్ వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ ప్రైవేట్ జిన్నింగ్ వ్యాపారి తెలివిగా వ్యవహరించినట్లు తెలుస్తుంది. ఉట్నూర్ మండలం షాంపూర్ గ్రామం నుంచి ఫేక్ టీఆర్‌లను తీసుకొని ఆదిలాబాద్ మార్కెట్‌లో సీసీఐకి పత్తిని విక్రయించాడన్న ఆరోపణలు వస్తున్నాయి. రైతుల నుంచి తక్కువ ధరకే కొనుగోలు చేసి బినామీ రైతులు, బంధువుల పేర్లతో సీసీఐకి అధిక ధరలకు అంటగట్టారన్న ఆరోపణలు లేక పోలేదు. ఆదిలాబాద్ మార్కెట్‌లో టీఆర్‌పై పత్తిని విక్రయించిన వారి వివరాల ను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే అసలు బాగోతం బయటపడే అవకాశం ఉంది. ఇప్పటికే సంబంధిత ప్రైవేట్ వ్యాపారిపై రాష్ట్ర ఇంటలిజెన్స్ అధికారులకు కొంత మంది ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో త్వరలోనే పూర్తి ఆధారాలతో దర్యాప్తు చేసే అవకాశం కనిపిస్తుంది.

తాంసి మండలంలో భారీ వర్షం

తాంసి, మే 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో ఆదివారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై చెట్లు విరిగి పడిపోయాయి. తాంసిలోని ప్రాథమిక పాఠశాల ప్రహరీ కూలిపోయింది. గిరిగావులో రెండు ఇల్లు నేలమట్టమయ్యాయి. కప్పర్లలో పూరిగుడిసె కూలిపోయింది. వీటితో పాటు జొన్న, పెసరి, ఇతర పంటలకు కూడా నష్టం వాటిల్లింది. ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం వల్ల మండల కేంద్రంలో కొనుగోలు చేస్తున్న జొన్నల కొనుగోలు కేంద్రంలో కూడా తీవ్ర ఆందోళన నెలకొంది. జొన్నలన్నీ తడిసి ముద్దయ్యాయి. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులతో పాటు ఇల్లు నేలమట్టమైన లబ్ధిదారులు కోరుతున్నారు.

గంజాయి పట్టివేత

మావల, మే 12 (ఆంధ్రజ్యోతి): గంజాయిపై మావల పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. అక్రమంగా గంజాయి అమ్ముతున్న ఓ వ్యక్తితో పాటు ప్యాకెట్లలో సరఫరా చేస్తున్న ఓ గ్యాంగ్‌ను సైతం సోమవారం వేర్వేరుగా పోలీసులు పట్టుకున్నారు. మావల ఎస్సై విష్ణువర్ధన్ వివరాల ప్రకారం.. పట్టణంలోని తాటిగూడకు చెందిన కలిముద్దీన్ మహారాష్ట్ర నుంచి గంజాయి తెచ్చి పట్టణంలో విక్రయిస్తుంటాడు. అయితే పాలిటెక్నిక్ కాలేజ్ సమీపంలో అనుమానాస్పదంగా కనబడటంతో తనిఖీ చేయగా 500 గ్రాముల గంజాయి పట్టుబడింది. కలిముద్దీన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు.

అలాగే, కలిముద్దీన్ నుంచి గంజాయి కొనుగోలు చేసి ప్యాకెట్ల ద్వారా అమ్ముతున్న ఓ గ్యాంగ్‌ను మావల పోలీసులు పట్టుకున్నారు. పట్టణంలోని పిట్టలవాడ కాలనీ ఇండస్ట్రీయల్ ఏరియాలో ఓ గ్యాంగ్ గంజాయి తాగుతుండగా పట్టుబడ్డారు. ఈ గ్యాంగ్‌లో సంజయ్ నగర్‌కి చెందిన సయ్యద్ ముషరాఫ్, బొక్కలగూడకి చెందిన అబ్దుల్ ఫాజిల్, భుక్తపూర్‌కి చెందిన మహ్మద్ ఇర్షాద్‌తో పాటు మరో ఇద్దరు మైనర్లు పట్టుబడ్డారు. ఈ మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

ఇచ్చోడ/ బజార్‌హత్నూర్, మే 12(ఆంధ్రజ్యోతి): గాలివానతో కూడిన వర్షానికి నెలకొరిగిన విదుత్తు తీగలు తగిలి ఎద్దు మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, అధికారుల వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి గాలితో వర్షం కురిసింది. ఆ సమయంలో పంటపొలంలో ఉన్న విద్యుత్తు స్తంభం నెలకొరిగి విద్యుత్తు తీగలు కింద పడడంతో రైతు బత్తిని బాలాజీకి చెందిన ఆవు మృతి చెందింది. దీంతో ఉదయం రైతు విద్యుత్ అధికారులకు సమాచారం అందించాడు. రైతుకు నష్టపరిహారం అందేలా చూస్తామని విద్యుత్తు శాఖ అధికారులు పేర్కొన్నారు.

గౌతమ బుద్ధుడి బాటలో ప్రతి ఒక్కరూ నడవాలి : ఎమ్మెల్యే ఏలేటి


బుద్ధ జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ కల్చరల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించిన మహనీయుడు గౌతమ బుద్ధుడని, ఆయన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం బుద్ధపౌర్ణమి వేడుకలు బుద్ధ విహార్‌లో ఘనంగా నిర్వహించారు. ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హాజరై బుద్ధుడి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ... వైశాఖ పౌర్ణమిని బుద్ధ జయంతిగా నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు. బుద్ధధర్మాన్ని, ఆయన సద్గుణాలను మనం అంబేద్కర్ వల్లనే తెలుసుకున్నామని స్పష్టం చేశారు. బౌద్ధ ఉపాసకులు ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు రితేష్, నాయకులు రావుల రాంనాథ్, మేడిసెమ్మె రాజు, కమల్‌నయన్, ఆకుల కార్తీక్, అలివేలు, సాయి, సత్యం చంద్రకాంత్, మాజీ కౌన్సిలర్ నరేందర్, ఆడెపు సుధాకర్, పొన్నం నారాయణ గౌడ్, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

తానూర్ మండలంలో..

తానూర్, మే 12 (ఆంధ్రజ్యోతి) : బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని మండల కేంద్రమైన తానూర్‌తో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా భారతీయ బౌద్ధమహాసభ రాష్ట్ర నాయకులు సురేకాంత్ పవార్ మాట్లాడుతూ దేశానికి శాంతి, అహింసా మార్గాన్ని పరిచయం చేసిన మొదటి వ్యక్తి గౌతమ బుద్ధుడు అని అన్నారు. ప్రతి ఒక్కరు బుద్ధుని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. నేటి సమాజానికి బుద్ధుని చరిత్ర తెలుసుకోవడం ఎంతో అవసరమన్నారు. ఆయన సూచించిన మార్గాలను అనుసరించాలని సూచించారు. ఈకార్యక్రమంలో నాయకులు సాయినాథ్ బద్రె, మానిక్, దీపక్, మహేష్, అశోక్, సుధాకర్‌బాబు, సునీల్, రాహుల్, లక్ష్మణ్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

మన్మథ్‌లో గౌతమ బుద్ధుడి విగ్రహ ఆవిష్కరణ

లోకేశ్వరం, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మన్మథ్ గ్రామంలో బద్దం గున్నవ్వ - రాజారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు పుష్ప - గంగారెడ్డి గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గౌతమ బుద్ధుడికి పూజలు నిర్వహించారు. గ్రామం మొత్తం పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఎంపీపీ లలిత భోజన్న, మాజీ సర్పంచ్‌లు శేఖర్‌రెడ్డి, శంకర్‌గౌడ్, అంబేద్కర్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.


తానూర్‌లో బుద్ధ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం


లోకేశ్వరంలో గౌతమబుద్ధుడి విగ్రహాన్ని ఆవిష్కరించిన దృశ్యం


లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దంపతులు

మంజులాపూర్‌లో లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణ మహోత్సవం

నిర్మల్ అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణం మంజులాపూర్ కాలనీలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి కల్యాణ మహోత్సవంలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సతీసమేతంగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంనాథ్, శనిగారపు చిన్నయ్య, అయిండ్ల సాత్విక్, రాజేష్, వినోద్‌రెడ్డి, సంపత్, లింగం, శివ, శ్రీకాంత్, సాయన్న, యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ నిర్మాణాలకు నిధుల మంజూరు

నిర్మల్ కల్చరల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నాలుగు కొత్త గ్రంథాలయాల నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరైనట్లు గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అర్జుమన్ అలీ తెలిపారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో జిల్లా ఇంచార్జ్ మంత్రి సీతక్క, ఎస్‌డీఎఫ్ నిధుల కింద మంజూరు చేశారని తెలిపారు. సోన్, దిలావర్‌పూర్, సారంగాపూర్, మామడ గ్రంథాలయాలకు ఈ నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. మంత్రి సీతక్కకు అర్జుమన్ అలీ కృతజ్ఞతలు తెలిపారు.

లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్ కల్చరల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : లైసెన్స్ సర్వే శిక్షణ కోసం మీసేవ కేంద్రాల్లో ఈ నెల 17 లోగా దరఖాస్తు చేయాలని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్, మేనేజ్మెంట్ శిక్షణ ఇవ్వనుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 26 నుండి జిల్లా కేంద్రంలో 50 పని దినాల శిక్షణ ఉంటుందన్నారు. ఇంటర్ గణితం, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ సివిల్, ఇతర సమాన అర్హతలు కలిగి ఉండాలని తెలిపారు. 18 నుండి 35 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ 40 ఏళ్ల వయసులోపు వారు దరఖాస్తు చేయాలన్నారు. వివరాలకు 9849081489, 7032634404, 9441947339 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

కరెంట్ షాక్‌తో మృతి చెందిన బాధిత కుటుంబానికి పరామర్శ

ముథోల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌కు చెందిన ఎండీ అజార్ అనే వ్యక్తి ఇటీవల కరెంట్ షాక్‌తో అకస్మాత్తుగా మరణించాడు. ఈ విషయం గ్రామస్థుల ద్వారా తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్ రావు పటేల్ ప్రజా ట్రస్ట్ ఛైర్మన్ భోస్లే మోహన్ రావు పటేల్ సోమవారం ముథోల్‌లోని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎండీ అజార్ కుటుంబానికి రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ముథోల్ మాజీ ఎంపీపీ జాదవ్ సుభాష్ పటేల్, ఎజాజ్, నాయకులు, తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

లోకేశ్వరం, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జోహర్‌పూర్ గ్రామానికి చెందిన మ్యాదరి సాయన్న(58) గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మరణించాడు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోలం శ్యామ్‌సుందర్ సోమవారం పరామర్శించారు.

ఆరోగ్యం అందించడంలో నర్సుల సేవలు వెలకట్టలేనివి

నిర్మల్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్ సింగ్

నిర్మల్ రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందించడంలో నర్సుల సేవలు వెలకట్టలేనివని జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ గోపాల్‌సింగ్ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ప్రసూతి ఆసుపత్రిలో నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకుడు గోపాల్‌సింగ్, డాక్టర్ విద్యులత, నర్సింగ్ పర్యవేక్షకులు ధనలక్ష్మి, విజయలక్ష్మి కేక్ కట్ చేసి నర్సింగ్ అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, నర్సింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


ఆసుపత్రిలో కేక్ కట్ చేస్తున్న డాక్టర్, నర్సులు

భైంసాలో పీజీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తా

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్




కాలేజ్ స్టడీ క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న ముథోల్‌ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ తదితరులు

భైంసా, మే 12 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గ పరిధిలోని విద్యార్థుల సౌకర్యార్థం భైంసాలో పీజీ కళాశాల ఏర్పాటుకు బాధ్యయుతంగా కృషి చేస్తున్నానని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ వెల్లడించారు. సోమవారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో స్థానిక గోపాల్‌రావ్ పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ముథోల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల స్టడీ క్యాలెండర్, అడ్మిషన్ల ప్రచార పోస్టర్లు, ఫ్లెక్సీలను విడుదల చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ఆద్యాపకులు ప్రచారాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. రెండు డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపక బృందం ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అనిర్వచనీయమైన సేవలు అందిస్తున్నారని అభినందించారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో విద్యాబోధనతో పాటు పోటీ పరీక్షల కోసం విద్యార్థులను అన్ని విధాలుగా సన్నద్ధం చేసేలా శిక్షణను ఇవ్వడం శుభ పరిణామమన్నారు. నియోజకవర్గ పరిధిలో పీజీ కళాశాల లేకపోవడం మూలంగా ఉన్నత విద్యాభ్యాసం కోసం గాను ఇక్కడి ప్రాంత విద్యార్థులు అవస్థలు పడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఇబ్బందులను తొలగించేందుకు, ఉన్నత విద్యాభ్యాస సౌకర్యం కల్పించేందుకు గాను భైంసాలో పీజీ కళాశాల ఏర్పాటు చేయిస్తానని స్పష్టం చేశారు. భైంసాలోని గోపాల్‌రావ్ పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర ప్రభుత్వం ఉష స్కీమ్ కింద మంజూరు చేసిన రూ.5 కోట్ల నిధులతో విద్యార్థులకు అవసరమైన మౌళిక వసతులు కల్పనతో పాటు అధునాతన డిజిటల్ లైబ్రరీ, కంప్యూటర్ శిక్షణ వ్యవస్థతో పాటు ఇతర సౌకర్యాల కల్పన పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని వివరించారు. ఇందులో కళాశాల అభివృద్ధి కమిటీ ప్రతినిధి డా.నగేష్, భైంసా గోపాల్‌రావ్ పాటిల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కర్రోల్ల బుచ్చయ్యతో పాటు ఆద్యాపక బృందం పాల్గొంది.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయించండి

● డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు

నిర్మల్ కల్చరల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయించాలని డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు జిల్లా కలెక్టర్‌ను కోరారు. సోమవారం నాయకులతో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నిర్మల్, సారంగాపూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌లు సోమ భీమ్‌రెడ్డి, అబ్దుల్ హాది, పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, తదితర నాయకులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

భైంసా, మే 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహింప తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు అన్ని వర్గాల మద్దతునిచ్చి విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్ పిలుపునిచ్చారు. సోమవారం భైంసాలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సీపీఐ డివిజన్ స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాసే దోరణి విధానాలతో ముందుకు సాగుతోందన్నారు. కార్పొరేట్ సంస్థలకు వత్తాసు పలికే రీతిలో వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. కార్మికుల భవిష్యత్తును దెబ్బతీసేలా తీసుకవచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్కీమ్స్ వర్కర్స్ అందరిని ప్రభుత్వరంగ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు ఇదే క్రమంలో ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రైవేటీకరణను అపివేయాలన్నారు.



తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహిస్తున్న వాసవి క్లబ్ బృందం

పిల్లల్లో సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చడం సమాజానికి శ్రేయస్కరం

- వాసవీ క్లబ్ డిప్యూటీ గవర్నర్ జితేందర్ గుప్తా
- ఖానాపూర్‌లో ఘనంగా తల్లిదండ్రులకు పాదపూజ

ఖానాపూర్, మే 12 (ఆంధ్రజ్యోతి) : భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పిల్లల్లో అలవర్చడం సమాజానికి అత్యంత శ్రేయస్కరమని వాసవి క్లబ్ డిప్యూటీ గవర్నర్ మహాజన్ జితేందర్ గుప్తా అన్నారు. సోమవారం వాసవి క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఇరుకుల్ల మమత రామకృష్ణల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వాసవి క్లబ్ డిప్యూటీ గవర్నర్ మహాజన్ జితేందర్ ఆధ్వర్యంలో ఖానాపూర్‌లోని వాసవి మాత ఆలయంలో తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పిల్లలతో వారి తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించి తల్లిదండ్రులను శాలువాతో సన్మానించారు. అనంతరం జితేందర్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పిల్లలను మంచి విలువలతో పెంచాలని సూచించారు. చిన్ననాటి నుంచే పిల్లలు మంచి ప్రవర్తన అలవరిస్తే సమాజంలో పెరుగుతున్న నేరాలు క్రమంగా అదుపులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు చిటికేసి రవీందర్, ప్రధాన కార్యదర్శి చిటికేసి సతీష్ కుమార్, కోశాధికారి కూరగాయల సతీష్ కుమార్, వనిత క్లబ్ అధ్యక్షురాలు కట్కం స్వరూప రాణి, ప్రధాన కార్యదర్శి నీలి శ్రీలత, మహిళా సంఘం అధ్యక్షురాలు గోలి పద్మజ, కే. సంతోష్ కుమార్, బి. మణికంఠ, చిటికేసి శంకర్, గంప మధుకర్, వాసవి క్లబ్, వనిత క్లబ్ సభ్యులు, పట్టణ ఆర్యవైశ్య సంఘ సభ్యులు, తదితరులున్నారు.



పాప హరేశ్వర స్వామివారికి అన్నపూజ చేస్తున్న భక్తులు

భక్తులతో కిటకిటలాడిన కదిలి ఆలయం

దిలావర్‌పూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిలి పాప హరేశ్వర స్వామి దేవాలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. పౌర్ణమి సోమవారం కలిసి రావడంతో పాపహరేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. గోముఖ గుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. పాప హరేశ్వర స్వామిని దర్శించుకుని అభిషేక పూజలు చేశారు. శ్రీమాతాన్న పూర్ణేశ్వరి దేవిని దర్శించుకున్నారు. కుంకుమార్చన పూజలు చేశారు. 18 వృక్షాలతో మిళితమైన మహా వట వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేసి పూజలు చేశారు. పాప హరేశ్వర స్వామి భక్తుడు నర్సాపూర్(జి) మండలం రాంపూర్ గ్రామానికి చెందిన జీవన్ రావు దంపతులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.



కదిలి మాతాన్నపూర్ణేశ్వరి దేవి



పాపహరేశ్వర స్వామి దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు

కన్నుల పండువగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

- భారీ సంఖ్యలో హాజరైన భక్తులు



హోమగుండం వద్ద పాల్గొన్న భక్తులు

బోథ్, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌటా (బి) గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ 20వ వార్షికోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో కొనసాగింది. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో చివరి రోజు అయిన సోమవారం కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా హోమ గుండాన్ని నిర్వహించి యజ్ఞం చేపట్టగా పలువురు భక్తులు పాల్గొన్నారు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి స్థానిక ఎస్సై ప్రవీణ్ హాజరు కావడంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా బ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ సభ్యులు ఎస్సైని సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ భక్తి భావనతో గ్రామస్తుల ఐక్యంగా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. మానసిక ప్రశాంతత కోసం ఆలయాలు అవసరమని పేర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యక్రమాలు కొనసాగాయి.

ఘనంగా బ్రహ్మోత్సవాలు

నార్నూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వెంకటేశ్వర తిరుమల దేవస్థానం బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముడు రోజుల పాటు జరిగిన ఈ వేడుకలకు చుట్టూ పక్కల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ విఠల్ రాథోడ్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.గజానంద్ నాయక్ , ధ్రమకర్త సూరజ్ సింగ్, సురేష్ ఆడె, విశ్వనాథ ఆడె, బాల జాదవ్, బిక్కు చౌహాన్, ప్రణీత బనోత్, గ్రామస్తులు, ఆలయ కమిటీ పూజారులు, బాలాజీ దీక్ష స్వాములు పాల్గొన్నారు.



బాలాజీ మందిరంలో పూజలు చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ విఠల్ రాథోడ్, బి.గజానంద్ నాయక్



జాతర్లలో జవాన్ పార్థివ దేహం వద్ద సెల్యూట్ చేస్తున్న అధికారులు, నాయకులు, యువకులు



జవాన్‌కు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



అంతిమ యాత్రకు హాజరైన ఆయా గ్రామాల ప్రజలు

అధికార లాంఛనాలతో..

సీఆర్‌పీఎఫ్ జవాన్ అంత్యక్రియలు

- జాతీయ జెండాలతో భారీఎత్తున యువకుల బైక్ ర్యాలీ
- పాడె మోసిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఇచ్చోడ/ బజార్‌హత్నూర్, మే 12(ఆంధ్రజ్యోతి): బజార్‌హత్నూర్ మండలంలోని జాతర్ల కన్నీటి సంద్రంగా మారింది. ప్రతీఒక్కరి హృదయాలు బరువెక్కిపోయాయి. సీఆర్‌పీఎఫ్ జవాన్ అర్క మేఘనాథ్‌కు కన్నీటి నివాళి అర్పించారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించి జవాన్‌కు తుది వీడ్కోలు పలికారు. జార్ఖండ్‌లో జవాన్‌గా విధులు నిర్వహిస్తున్న అర్క మేఘనాథ్ గతశనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. జవాన్ పార్థివ దేహం స్వగ్రామానికి వస్తుందని తెలుసుకున్న బజార్‌హత్నూర్ మండలం లోని చుట్టుపక్కల గ్రామాల యువకులు పెద్దఎత్తున హాజరయ్యారు. పోలీస్ స్టేషన్ నుంచి జాతర్లలోని జవాన్ స్వగృహం వరకు జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన సీఆర్‌పీఎఫ్ అసి స్టెంట్ కమాండర్ వినయ్ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎస్ పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. అనంతరం పార్థివదేహాన్ని పేటిక నుంచి బయటకి తీసి కుటుంబసభ్యులకు అప్ప జెప్పారు. వారు గిరిజన సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలను నిర్వహిం చారు. కాగా సోమవారం స్వస్థలం జాతర్లలో జరిగే అంతిమ వీడ్కోలుకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. జవాన్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలి పా రు. అలాగే, జవాన్ అంత్యక్రియలకు ఆయా పార్టీల నాయకులు, అధికారులు, యువకులు పెద్దఎత్తున హాజరై అంతిమ వీడ్కోలు పలికారు.



సైనిక వందనం చేస్తున్న సీఆర్‌పీఎఫ్ పోలీసులు



గిరిజన సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

కన్నుల పండువగా కాల్వ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం



కాల్వ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి దంపతులు



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



జిల్లా ఎస్పీకి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దేవస్థానం ఈవో భూమయ్య

దిలావర్‌పూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): భక్తుల ఇలవేల్పు కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం సోమవారం వైభవం గా జరిగింది. నర సింహ స్వామి కల్యాణోత్సవానికి జిల్లా నలు మూలల నుంచే కాకుండా పరిసర జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు లక్ష్మీ నరసింహ స్వామి వారి కల్యాణోత్సవాన్ని కను లారా తిలకించేందుకు తరలివచ్చారు. భక్తులతో కాల్వ అడవులు జనసంద్రమయ్యాయి. స్వామివారి పుష్కరిణిలో భక్తులు పవిత్ర స్నానాలు చేశారు. కల్యాణోత్సవంలో భాగంగా నిర్వ హించే ఎదుర్కోలు కార్యక్రమం భక్త లను విశేషంగా ఆకట్టు కుంది. స్వామివారు అలక బూనటం అమ్మవారి తరపు వారు స్వామివారిని బ్రతిమిలాడి కల్యాణ మండపానికి తీసుకువచ్చే తంతు భక్తులను విశేషంగా ఆకర్షించింది. యజ్ఞ చార్యులు శ్రీమాన్ డా. చక్రపాణి నరసింహ మూర్తి, శ్రీమాన్ వాసుదేవా చార్యుల ఆధ్వర్యంలో వేద పండితులు వేద మంత్రాలు పఠి స్తుండగా వేలాది మంది భక్తుల సమక్షంలో నరసింహ స్వామి వారు అమ్మవారికి మంగళసూత్రధారణ చేశారు. ఈ ఘట్టం భక్తులను భక్తి పారవశ్యంలో ముంచింది. అనంతరం భక్తులు స్వామివారి పాదాల చెంత తలంబ్రాలు వేసి మొక్కులు చెల్లిం చుకున్నారు. కట్న కానుకలు సమర్పించుకున్నారు.

స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖులు

సోమవారం జరిగిన కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణో త్సవంలో పలు వురు ప్రముఖులు పాల్గొన్నారు. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కు లు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారి కల్యాణోత్సవం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం పాలకవర్గం స భ్యులు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డిని శాలువాతో సత్కరించి, స్వామివారి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. డీసీసీ అధ్యక్షు డు కూచాడి శ్రీహరి రావు, జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల, ఏఎస్పీ రాజేష్ మీనా స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. హరి రావును, ఎస్పీ జానకి షర్మిలను పా లకవర్గం సభ్యులు ఘనంగా సన్మానించారు. మాజీ డిప్యూటీ స్పీకర్ దివంగత నేత అయిండ్ల భీమ్ రెడ్డి తనయుడు చంద్ర మోహన్‌రెడ్డి దంపతులు వేలాదిగా తరలివచ్చిన భక్తులకు అన్న ప్రసాద వితరణచేశారు.

జన సంద్రంగా కాల్వ అడవులు

లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణ మహోత్సవానికి తరివచ్చిన వేలాది మంది భక్తులతో కాల్వ అడవులు జనసంద్రమయ్యా యి. ఎటు చూసిన భక్తజన సందోహమే కనిపించింది. కల్యా ణం అనంతరం స్వామివారి పాదాల చెంత తలంబ్రాలు వేసేందుకు భక్తులు పోటీ పడ్డారు. దీంతో కొంత తొక్కిసలాట జరి గింది. పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకుని తొక్కిసలాట జరుగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పుష్కరిణి వద్ద భద్రత ను కట్టుదిట్టం చేశారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు జరుగకుండా నిర్మల్ రూరల్ సీఐ కృష్ణ, దిలావర్‌పూర్ ఎస్సై లోక సందీప్, నర్సాపూర్(జి), ఎస్సై సాయికిరణ్, నిర్మల్ రూరల్ ఎస్సై లింబాద్రి, ఉమెన్ ఎస్సై శ్రావణి, టౌన్ ఎస్సై జుబేర్‌లు భద్రత ను పర్యవేక్షించారు. దేవస్థానం చైర్మన్ అం గూరి మహేందర్ ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎప్పటి కప్పుడు చర్యలు తీసుకున్నారు.

ముగిసిన నరసింహ స్వామి జయంతి వేడుకలు

భైంసా: పట్టణంలోని నర్సింహనగర్ కాలనీ పరిధిలో గల పుణ్య క్షేత్రమైన నర సింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల కోలాహలం మధ్య ప్రారంభమైన నర సింహస్వామి జయంతి వేడుకలు సోమవారం ముగిసాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆలయ నిర్వాహకులు నరసింహ స్వామి విగ్రహాన్ని శోభయమానంగా అలంకరించారు. వేడుకల ముగింపు పూజ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు గాను భక్తులు ఆలయానికి అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు సోమవారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన అన్నదాన కార్యక్రమం సాయంత్రం వరకు కొనసాగింది. పట్టణ పరిధిలోని భక్తులే కాకుండా సమీప గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ముగింపు వేడుకల్లో పాల్గొన్ని భక్తిశ్రద్ధలతో పూజ కార్యక్రమాలు నిర్వహించారు.



భైంసాలోని నరసింహస్వామి ఆలయంలో భక్తుల సందడి

కుంటాల: మండల కేంద్రం కుంటాల స్థానిక ప్రాచీన శ్రీకృష్ణ దేవాలయంతో పాటు అందకూర్ లక్ష్మీ నర్సింహ స్వామి ఆల యంలో సోమవారం నరసింహ స్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా స్థానిక వేద పండితులు సదాశివ్ జోషి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం నుంచి నరసింహ స్వామికి అభిషేకం, అర్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం హోమం నిర్వహించారు. హోమం కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు సతీసమేతంగా పాల్గొన్నారు ఆ తర్వాత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



అందకూర్ గ్రామంలో యజ్ఞం నిర్వహిస్తున్న గ్రామస్థులు

కమనీయం.. శివ పార్వతుల కల్యాణం

మామడ, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్దుర్తి గ్రామంలో సోమవారం రోజున రాజరాజేశ్వర స్వామి ఆలయ 6వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నాగార్జున చారి, భూమయ్య చారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక భక్తితోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని, ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం శివ పార్వతులకు కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక హోమం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహా అన్న దానం నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు, పిల్లలు పాల్గొన్నారు. మంగళహారతులతో శివ పార్వతులకు పూజలు చేశారు. సాయంత్రం సమ యంలో పల్లకి సేవ గ్రామాల వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. గ్రామం శివ నామస్మరణతో మార్మోగింది. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పడాల శ్రీనివాస్, వీడీసీ సభ్యులు జీవన్, భీమేష్, శేఖర్, రాజేశ్వర్, సుదర్శన్, వెంకట్, రాములు, బుచ్చన్న, మహేందర్ పాల్గొన్నారు.



యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం



నల్దుర్తిలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు




శివపార్వతుల అలంకరించిన విగ్రహాలు



నల్దుర్తి రాజరాజేశ్వర ఆలయం ఇదే



శివాలయంలో ఉత్సవ విగ్రహాలు





● మార్కెట్ యార్డులో పత్తి పంటను విక్రయిస్తున్న దృశ్యం (ఫైల్)



పత్తి కొనుగోళ్లలో.. అక్రమాల బాగోతం

- జిల్లాలో అడ్డగోలుగా టీఆర్‌లను జారీ చేసిన వ్యవసాయ శాఖ అధికారులు
- ఇప్పటికే ఇద్దరు అధికారుల సస్పెన్షన్
- ఇటీవల ఇంద్రవెల్లి మార్కెట్‌లో డీడీ రహస్య విచారణ
- రూ.26 లక్షల వరకు అవినీతి జరిగినట్లు నిర్ధారణ?
- ఉట్నూర్ మండలం షాంపూర్‌లో టీఆర్‌లతో సీసీఐకి పత్తిని విక్రయించిన ఓ జిన్నింగ్ వ్యాపారి
- త్వరలోనే మరికొంత మందిపై వేటు వేసేందుకు రంగం సిద్ధం

ఆదిలాబాద్, మే 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీసీఐ పత్తి కొనుగోళ్లలో అక్రమాల బాగోతం బయటపడుతోంది. ఈ యేడు జిల్లా వ్యాప్తంగా కోట్ల రూపాయల అక్రమ కొనుగోళ్లు జరిగినట్లు రాష్ట్రస్థాయి అధికారులు అంచనా వేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా టెంపరరీ రిజిస్ట్రేషన్ (టీఆర్)లను జారీ చేసి అధికారులు అందినకాడికి దండుకున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే ఇద్దరు అధికారుల పై వేటు వేసిన ఉన్నతాధికారులు విచారణ మరింత వేగవంతం చేస్తున్నారు. ఇటీవల నలుగురు మార్కెట్ కమిటీ కార్యదర్శులకు నోటీసులు జారీ చేశారు. రాష్ట్రంలోనే అత్యధికంగా 27 లక్షల క్వింటాళ్లకు పైగా పత్తిని ప్రైవేట్ వ్యాపారులు, సీసీఐ కొనుగోలు చేసినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. కొంత మంది అధికారులు వ్యాపారులతో కుమ్మకై పత్తి రైతులను నిండుగా ముంచినట్లు విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా ఆదిలాబాద్ ఏ, బీ సెంటర్‌లలోనే ఎక్కువగా గోల్‌మాల్ దందా జరిగిందన్న విమర్శలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో జరిగిన పత్తి కొనుగోలుపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. దీనిపై అధికార, ప్రతిపక్షాలు కూడా తీవ్ర విమర్శలకు దిగుతున్నాయి. త్వరలోనే పోలీసు విధానంతో పాటు సీబీఐ విచారణ జరిపించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. మార్కెటింగ్, వ్యవసాయ శాఖ అధికారుల తప్పిదాలే అవినీతికి కారణమని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ప్రతియేటా జిల్లాలో పత్తి కొనుగోళ్లలో భారీస్కాం జరుగుతున్నా.. తేలికగానే తీసుకుంటున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయి. ఇంత జరిగిన ఇప్పటి వరకు జిల్లా ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

పరిశీలించకుండానే టీఆర్‌ల జారీ

ఎలాంటి ఆధారం లేని కౌలు రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో పంటలను అమ్ముకునే విధంగా ప్రభుత్వం టెంపరరీ రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించింది. దీని ఉద్దేశం మంచిదే అయినప్పటికీ కొంతమంది అధికారులు అవినీతికి అలవాటు పడి అడ్డగోలుగా టీఆర్‌లను జారీకి ఎగబడ్డారు. క్షేత్రస్థాయిలో పంటల సాగు విస్తీర్ణంను పరిశీలించకుండానే తాత్కాలిక రిజిస్ట్రేషన్లు చేశారు. ఇదే అదునుగా దళారులు, ప్రైవేట్ వ్యాపారులు అధికారులను ఆశ్రయించి అక్రమ కొనుగోళ్లకు తెరలేపినట్లు తెలుస్తుంది. ఒక్కో క్వింటాల్‌కు రూ.300ల నుంచి రూ.500ల వరకు అధికారులు జేబులో వేసుకుని అనుమతులు ఇచ్చారు. అసలు పంటల సాగు వివరాలను ఖచ్చితంగా నమోదు చేయక పోవడమే ఇలాంటి పరిస్థితికి కారణమవుతోంది. వ్యవసాయ శాఖ అధికారులు ఖచ్చితమైన వివరాలనుఆన్‌లైన్‌లో నమోదు చేసి ఉంటే అవకతవకలకు అస్కారమే ఉండదంటున్నారు. కొంత మంది అధికారులు ముందుచూపుతోనే పంటల సాగు తప్పుడు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలుస్తుంది. వ్యవసాయ శాఖ తప్పిదాల కారణంగా ప్రతియేటా అసలైన అన్నదాతలకు మద్దతు ధర దక్కడం లేదంటున్నారు.

సిద్ధమవుతున్న నివేదిక

పత్తి కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్కెట్ శాఖ వరంగల్ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) ఇటీవల జిల్లాలోని ఆదిలాబాద్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీలలో రహస్యంగా అంతర్గత విచారణ జరిపినట్లు తెలుస్తుంది. ఇంద్రవెల్లి మార్కెట్లో పత్తి కొనుగోళ్ల వివరాలు, అధికారుల వ్యక్తిగత అకౌంట్లను పరిశీలించినట్లు సమాచారం. సుమారుగా 26 లక్షల వరకు అవినీతి జరిగి ఉండవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఓ ఉన్నత స్థాయి అధికారితో పాటు కిందిస్థాయి సిబ్బంది అక్రమాలకు పాల్పడినట్లు తెలిసింది. వ్యాపారులు దళారులతో కుమ్మకై పత్తి కొనుగోళ్లకు అనుమతించారన్న ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై త్వరలోనే ప్రభుత్వానికి నివేదికను అందించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఆదిలాబాద్ మార్కెట్‌లో



(తరువాయి 6వ పేజీలో...)

పాలిసెట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

ఆదిలాబాద్ రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి గాను నిర్వహించే పాలిసెట్ పరీక్షకు సంబంధిత అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. ఆదిలాబాద్‌లో మూడు కేంద్రాలను ఏర్పాటు చేయగా జిల్లా వ్యాప్తంగా 1102 మంది దరఖాస్తు చేసుకున్నారు. అంతేకాకుండా పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. అబ్జర్వర్‌లు, చీఫ్ సూపరింటెండెంట్, కోఆర్డినేటర్ సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను సందర్శించారు.

● నిమిషం నిబంధన : కోఆర్డినేటర్

పాలిటెక్నిక్ ప్రవేశాలకై నిర్వహించే పాలిసెట్ పరీక్షకు నిమిషం నిబంధన ఉందని పాలిసెట్ కోఆర్డినేటర్ బండి రాంబాబు పేర్కొన్నారు. మూడు కేంద్రాలు ఏర్పాటు చేయగా 1,102 మంది పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. మొత్తం నలుగురు అబ్జర్వర్లను, ఒక స్పెషల్ ఆఫీసర్ను నియమించినట్లు వెల్లడించారు. ఉదయం 11 నుంచి 1.30 వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. 10 నుంచి లోపలికి అనుమతిస్తామని నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉందని స్పష్టం చేశారు.



ఫిర్యాదుదారుల సమస్యలను వింటున్న ఎస్పీ

సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలి : ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, మే 12(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ అన్నారు. సోమవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి ఫిర్యాదుదారులు తమ సమస్యలను తెలిపారు. దాదాపు 30 మంది ఫిర్యాదుదారులు ఫిర్యాదులను సమర్పించగా వారి సమస్యలను విన్న ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలను ఇచ్చి ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 24గంటలు ప్రజల రక్షణ భద్రతకై పని చేసే ఏకైక వ్యవస్థ పోలీసు వ్యవస్థ అని, ఎలాంటి అత్యవసర సమయంలోనైనా డయల్ 100ను సంప్రదించాలన్నారు. ఇందులో సీసీ కొండ రాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారి జైస్వాల్ కవిత, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధికారుల సంఘం ఎన్నిక

ఆదిలాబాద్ రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): జిల్లా అధికారుల సంఘం నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. సంఘ అసోసియేట్ అధ్యక్షుడిగా జడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి, అధ్యక్షుడిగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, వైస్ ప్రెసిడెంట్ డీడబ్ల్యూవో మిల్కా, జనరల్ సెక్రెటరీ డీఆర్డీవో రవీందర్ రాథోడ్, ట్రెజరర్‌గా జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి సునీతతో పాటు పలువురు ఎన్నికయ్యారు. కాగా, నూతన కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ రాజర్షిషాను కలిశారు.

గురుకుల కళాశాలలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఉట్నూర్, మే 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ప్రవేశం కోసం అర్హులైన గిరిజనులు దరఖాస్తు చేసుకోవాలని పీవో ఖుష్బుగుప్తా, రీజినల్ కోఆర్డినేటర్ అగస్టియస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, సీఎస్, ఏటీ, సీజీటీవృత్తి విద్య కోర్సులకు ఈ నెల 15న ఉట్నూర్ లాల్ టేకిడి జూనియర్ గురుకుల కళాశాలలో బాలురకు, 16న గిరిజన గురుకకుల బాలికల జూనియర్ కళాశాల కొమురంభీం ప్రాంగణంలో బాలికలకు కౌన్సిలింగ్ ఉంటుందన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులు అయిన గిరిజన విద్యార్థులు హాజరు కావాలన్నారు. బోనాఫైడ్, టీసీ, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, 4 ఫొటోలు తీసుకొని ఉదయం 10గంటలకు కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు.

పత్తి విత్తనాల పట్ల జాగ్రత్త : ఏవో

నార్నూర్, మే 12 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కావాల్సిన పత్తి విత్తనాలు తమ దుకాణాల వద్ద అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయ శాఖాధికారి ఆకాష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద డీలర్‌తో సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ నియమ నిబంధనలు ప్రకారం రైతులకు ఏఆర్‌పీ ధరకే ఇవ్వాలన్నారు. పొరపాటు లేదా రైతులను ఇబ్బంది పెట్టినట్లుగా తెలిస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజాలింగు, ఎస్సై కె.అఖిల్, డీలర్ జ్ఞానోబా పుష్కర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఫిర్యాదుల కౌంటర్ ఏర్పాటు

ఆదిలాబాద్ రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరం వద్ద మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల ఫిర్యాదుల కౌంటర్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. పలువురు లబ్దిదారులు అధికారులకు దరఖాస్తులను సమర్పించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై పలువురు ఫిర్యాదు చేశారు. ఇందిరమ్మ ఇళ్లలు కేటాయింపు పారదర్శకంగా నిర్వహించేందుకు కౌంటర్ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

కొనుగోలు కేంద్రం లేక ఆందోళన

ఉట్నూర్, మే 12(ఆంధ్రజ్యోతి): యాసంగి వరి ధాన్యం పండించిన రైతులకు కొనుగోలు కేంద్రం అందుబాటులో లేక ఆందోళన చెందుతున్నారు. మండలంలోని బీర్సాయిపేటలో ఐకేపీ ఆధ్వర్యంలో మహిళ సంఘాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినప్పటికీ ఉట్నూర్, లక్కారం, గంగన్నపేట, కొమ్ముగూడ ప్రాంత రైతుల ధాన్యం కొనుగోలు చేసేవారు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో యాసంగిలో 229 ఎకరాల్లో, 250 మంది రైతులు వరి పంట సాగు చేశారు. సుమారు 7వేల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని భావిస్తున్నారు. గంగన్నపేటలో ప్రతియేటా పౌర సరఫరాల అధికారులు ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేవారు. కాని ఈ యేడు ఇంకా ఏర్పాటు చేయక పోవడంతో వరి పండించిన రైతులు పంటను అమ్ముకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. అకాల వర్షాల వల్ల పంట నష్టం వాటిల్లకుండా జిల్లా అధికారులు స్పందించి గంగన్నపేటలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా



అర్జిదారులతో మాట్లాడుతున్న పరిపాలనాధికారి స్వామి

దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

● జిల్లా కలెక్టర్ రాజర్షి షా ● ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 107 దరఖాస్తులు ● పాల్గొన్న ఆయా శాఖల అధికారులు

ఆదిలాబాద్ రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 107 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీఓ వినోద్ కుమార్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా భూ సమస్యలు, పెన్షన్, ఇందిరమ్మ ఇళ్లు, విద్య, వైద్యం, వ్యవసాయం, విద్యుత్, డీడబ్ల్యూం, తదితర శాఖలకు సంబంధించి అర్జీలను స్వీకరించి ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఇందులో వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు

ఉట్నూర్: జిల్లాలోని గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరిత గతిన చర్యలు తీసుకుంటున్నామని ఐటీడీఏ పరిపాలన అధికారి దామోదరస్వామి అన్నారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ చాంబర్‌లో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలకు సంబంధించిన అర్జీలను ఆచప స్వీకరించారు. దీనిలో భాగంగా ఉట్నూర్ మండలం ఫాకిర్‌గుట్టకి చెందిన కవిత తనకు ఏదైనా ఉద్యోగం కల్పించమని, ఉట్నూర్ మండలం లక్కెటిపేట గ్రామానికి చెందిన ఆత్రం అంజలి తనకు వైద్య నిమిత్తం కోసం ఆర్థిక సహాయం కల్పించమని, బేల మండలం పిటగాం గ్రామానికి చెందిన శేషుబాయ్ తనకు బోర్‌వెల్ మంజూరు చేయాలని కోరారు. అంతేకాకుండా పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఏవో సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్యామల,జేడీఎం నాగభూషణం, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గౌతమ బుద్ధుడి మార్గం స్ఫూర్తిదాయకం

● అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వాగ్మారే కామరాజ్ ● పలుచోట్ల ఘనంగా బౌద్ధ పౌర్ణిమ వేడుకలు

ఇంద్రవెల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): గౌతమ బుద్ధుడి మాటలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి వాగ్మారే కామరాజ్ అన్నారు. మండల కేంద్రంలోని మిలింద్ నగర్ కాలనీలోని త్రిరత్న బుద్ధ విహర్‌లో బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మొదటి గౌతమ బుద్ధుడు ప్రతిమతోపాటు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి వారిని స్మరించుకున్నారు. అనంతరం పంచశీల జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్ధుడి బోధనలు ప్రతిఒక్కరూ అనుసరించి శాంతిమార్గంలో పయనించాలని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ ఉపాసకులు మాస్కే రాజవర్దన్, సోమోరే గౌతమ్, సూర్యవంశీ దయానంద్, మహామాయ ఉపాసిక సంఘ్ సభ్యురాలు ఉషాబాయి, శీలాబాయి, తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రవెల్లి విహార్‌లో బుద్ధ వందన కార్యక్రమంలో పాల్గొన్న బౌద్ధ ఉపాసకులు



నార్నూర్‌లో గౌతమ బుద్ధుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

● బుద్ధుడి బోధనలు మానవ జీవనానికి రక్షా

నార్నూర్: ప్రపంచ శాంతి దూత గౌతం బుద్ధుడి బోధనలు ఆయన ఇచ్చినా శాంతి మార్గం వింటేనే మానవుడు జీవనాన్ని రక్షాల అనిపిస్తుందని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.గజానంద్ నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఘనంగా బౌద్ధ పౌర్ణిమ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై బుద్ధ విహారంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ మేధావి డాక్టర్ అంబేద్కర్ బౌద్ధ మతాన్ని స్వీకరించారు అంటే మనిషి జీవన విధానానికి ఎన్ని అమూల్యమైన వాస్తవ నిజాలు ఉన్నాయనేది అర్థం చేసుకోవచ్చు అన్నారు. ఇందులో కాంతారావు దుర్గే , కేశవ్ దుర్గే, సునీల్ చాలుర్కర్, గునువంత రావు దుర్గే, సురేందర్ కోలేత్కర్, భీంరావు, అనిల్, సంతోష్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



తాంసి(కే) నుంచి వాహనంలో రేషన్ బియ్యం తెచ్చుకుంటున్న గొల్లగడ్ గ్రామస్థులు (ఫైల్)

గొల్లగడ్ సమస్యలపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

● అధికారులను పిలిచి వివరణ కోరిన కలెక్టర్

భీంపూర్, మే 12(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గ్రామాలపై నిర్లక్ష్యం తగదని, భీంపూర్ మండలం గొల్లగడ్ గ్రామ సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా భీంపూర్ మండల అధికారులకు స్పష్టంగా ఆదేశాలు ఇచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్ కార్యక్రమానికి గొల్లగడ్‌కు చెందిన యువకులు దీపక్, అభిలాష్, తదితరులు కలెక్టర్‌కు గ్రామ సమస్యలను విన్నవించారు. ఆదివారం సాయంత్రం గాలివానతో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, అయినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. అలాగే మిషన్ భగీరథ నీరు రాక ఇబ్బంది అవుతుందన్నారు. పక్క గ్రామానికి వెళ్లి చౌకధరల సరుకులను కాలినడకనే తెచ్చుకుంటున్నామని,దీంతో ఒక్కరోజు కూలి నష్ట పోతునామని వాపోయారు. వాహనాల్లో కిరాయి పెట్టుకొని రేషన్ తెచ్చుకుంటున్నామని, మా గ్రామంలోనే చౌకధరల దుకాణం ఏర్పాటు చేయాలన్నారు. 4కిలో మీటర్ల రోడ్డు నిర్మాణం పూర్తి చేసి బస్సు సౌకర్యం కల్పించాలన్నారు.

15 వరకు జొన్నల కొనుగోళ్లు నిలిపివేత

తాంసి, మే 12 (ఆంధ్రజ్యోతి): తాంసి సహకార సొసైటీ మార్కెట్ యార్డులో జొన్నలు అధికంగా ఉండడం వల్ల ఈనెల 15వ తేదీ వరకు కొనుగోళ్ల నిలిపివేస్తున్నట్లు సీఈవో కేశవ్ ఒక ప్రకటన పేర్కొన్నారు. 16వ తేదీ నుంచి యధావిధిగా కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. వర్షాలకు జొన్నలు కనుక నానినట్లయితే వెంటనే వాటిని ఎండ పెట్టాలని నానిన జొన్న లను కొనే ప్రసక్తి లేదని పేర్కొన్నారు. రైతులు ఈ విషయంలో సహకరించాలని ఆయన కోరారు.

డిజిటల్ లిటరసీపై అవగాహన

ఆదిలాబాద్ రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): డిజిటల్ లిటరసీపై అవగాహన పెంచుకోవాలని జిల్లా మిషన్ కోఆర్డినేటర్ యశోద అన్నారు. సోమవారం బంగారిగూడలోని ఆదిలాబాద్ రూరల్ కేజీబీవీ పాఠశాలలో కొనసాగుతున్న సమ్మర్ క్యాంప్ విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ అవగాహన కార్యక్రమం మిషన్ శక్తి జిల్లా మహిళా సాధికారత, సఖి కేంద్రం సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డిజిటల్ లిటరసీపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. డిజిటల్ సాధనాల ద్వారా కెరీర్ అభివృద్ధి, ఇంటర్నెట్ ఉపయోగాలు, సోషల్ మీడియా, దాని ప్రభావం గురించి అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం సఖి కేంద్రం సిబ్బంది సంఘమిత్ర సఖి కేంద్రం సేవలు గురించి అవగాహన కల్పించారు. బాధితులకు అండగా ఉంటూ వారికి న్యాయం చేసేల కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్ ఉదయశ్రీ, స్పెషల ఆఫీసర్ జాదవ్ కవిత, డీహెచ్‌డబ్ల్యూ సిబ్బంది కోటేశ్వర్, కృష్ణవేణి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా మిషన్ కోఆర్డినేటర్ యశోద